


సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 584.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,200 క్యూసెక్కులు వదిలారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 3800 క్యూసెక్కులు విడుదల చేశారు.



నయనపర్వం శ్రీకృష్ణ పారిజాతం

కూచిపూడి(మొవ్వ): కూచిపూడిలో గురువారం డాక్టర్ శుభ మరువాడ(అమెరికా)శిష్యబృందం ప్రదర్శించిన శ్రీకృష్ణ పారిజాతం కూచిపూడి నృత్యరూపకం నయనపర్వంగా సాగింది.

న్యూస్‌రీల్

ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే సహించేది లేదు

జిల్లా మైనింగ్ అధికారి రాజేష్

బాపట్లటౌన్: జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే సహించేది లేదని జిల్లా మైనింగ్ అధికారి రాజేష్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం మండలంలోని వెదుళ్లపల్లి సమీపంలో ఉన్న ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఇసుక అక్రమ రవాణా చేసినా, నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపినా సహించేది లేదన్నారు. రీచ్‌లను పరిశీలించిన వారిలో బాపట్ల ఆర్డీవో గ్లోరియా, బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు పాల్గొన్నారు.

సమస్యలపై సీఎంకు 108 సిబ్బంది మెయిల్



గుంటూరు మెడికల్: రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమాల్లో భాగంగా గురువారం జిల్లాలోని 108 అంబులెన్సు ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మెయిల్ ద్వారా వినతి పత్రం పంపించారు. 108 అంబులెన్సు ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ శివశంకరరావు మాట్లాడుతూ తమ సమ్మె నోటీసును సీఎంకు మెయిల్ చేశామని, పరిష్కారం లభించకపోతే ఈ నెల 26వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామన్నారు. 25న విజయవాడలో నిరసన కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి విజయవాడకు ఉద్యోగులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ షేక్ బాబు, మల్లికార్జునరావు, సత్తార్, హసన్, కమల్, రవి, సుమన్, బాజీ, రామకృష్ణ, ఉదయ్‌కుమార్, షమ పాల్గొన్నారు.

రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం

గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 23న నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో సమావేశం ఉంటుందని జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షత వహించనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు. అజెండాలో పొందుపర్చిన అంశాలపై సమీక్ష ఉంటుందని సీఈవో తెలిపారు.

చురుగ్గా డ్రోన్ ఆపరేటింగ్ శిక్షణ



విజయవాడస్పోర్ట్స్: కమాండ్ కంట్రోల్ రూం వద్ద మహిళా పోలీసులకు ఇస్తున్న డ్రోన్ ఆపరేటింగ్ శిక్షణ చురుగ్గా సాగుతున్నట్లు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. శిక్షణ జరుగుతున్న తీరును డీసీపీ గౌతమి సాలి, సీఐ హనీష్‌తో కలిసి కమిషనర్ గురువారం పరిశీలించారు. జిల్లాలోని 75 మంది మహిళా పోలీసులకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణకు, ప్రజా శాంతిభద్రతల పరిరక్షణకు డ్రోన్‌లను వినియోగించనున్నట్లు తెలిపారు. ఆపరేటింగ్‌లో నిష్ణాతులై నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలని శిక్షణ తీసుకుంటున్న మహిళా పోలీసులకు సూచించారు.

రిటర్నబుల్ ప్లాట్లకు రేపు ఈ-లాటరీ

తాడికొండ: అమరావతి నిర్మాణం కోసం ఏపీసీఆర్డీఏ పరిధిలో భూసమీకరణలో భూములు అప్పగించిన రైతులకిచ్చే రిటర్నబుల్ ప్లాట్లకు ఈ నెల 23వ తేదీన ఈ-లాటరీ నిర్వహించనున్నట్లు ఏపీసీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలోని సంస్థ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ-లాట రీ ఉంటుందన్నారు. అమరావతి 9 గ్రామా ల్లోని రైతులకు ఆన్‌లైన్ ద్వారా ప్లాట్లను కేటాయించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కృష్ణాయపాలెం, నవులూరు, బోరుపాలెం, నెక్కల్లు, తుళ్లూరు గ్రామాల వారికి ఈ ప్రక్రియ చేపడతామని తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెలగపూడి, మందడం, నిడమర్రు, అనంతవరం గ్రామా లకు చెందిన రైతులకు ఈ-లాటరీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

"ఇసుకపై జీఎస్టీ, సీనరేజి లేకుండా చేశాం. ఎక్కడైనా స్వేచ్ఛగా ఇసుక తీసుకెళ్లొచ్చు.ఎవరైనా అడ్డుకుంటే పీడీ చట్టం కింద కేసులు పెడతాం.ఎట్టి పరిస్థితుల్లో ఉచిత ఇసుక వినియోగదారులకు అందాల్సిందే."

- బుధవారం అసెంబ్లీలో సీఎం చంద్రబాబు చెప్పిన మాటలు ఇవి.

"ఉచిత ఇసుక బాధ్యత ఎమ్మెల్యేదే"

ఇది బుధవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి చెప్పిన మరోమాట.

బాబు మాటలకు, చేతలకు పొంతన కుదరటం లేదు. టీడీపీ ప్రజాప్రతినిధులే అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఏ ఒక్క వినియోగదారుడికి ఉచిత ఇసుక అందకుండా చేస్తున్నారు. ఇసుక కావాలంటే రూ.3 నుంచి రూ.6 వేలు చెల్లించాల్సిందే అని హుకుం జారీ చేస్తున్నారు. నదులు, వంకలు, వాగులు, అసైన్డ్, అటవీ, ప్రభుత్వ భూములు వేటినీ వదలకుండా ఇసుక తవ్వితీసి అమ్మకానికి పెడుతున్నారు.

- ట్రాక్టర్ రూ.3 నుంచి రూ.6 వేలు
- పర్చూరు, చీరాల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇసుక సరఫరా
- తెలంగాణకు సైతం ఇక్కడి నుంచే తరలింపు
- కృష్ణా నది నుంచి ఇసుకను తరలిస్తున్న టీడీపీ నేతలు
- గాజుల్లంక నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న జనసేన నేతలు
- బాపట్ల జిల్లాలో ఇప్పటికీ ప్రారంభంకాని ప్రభుత్వ రీచ్‌లు
- ఆందోళనలో వినియోగదారులు

గాజుల్లంక ప్రాంతంలోని కృష్ణా నదిలో పచ్చ నేతలు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న దృశ్యం



బాబూ..ఇసుక..!

ఉచితం అందడం లేదు...దోపిడీ ఆగడం లేదు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: బాపట్ల జిల్లాలోని వేమూరు, రేపల్లె, బాపట్ల, చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో ఉన్న అన్ని వనరుల నుంచి ఇసుకను అక్రమంగా తరలించి అమ్ముకుంటున్నారు. చంద్రబాబు సర్కార్ చెప్పినట్లు ఇప్పుడు ఏ ఒక్క వినియోగదారుడికి ఉచిత ఇసుక అందే పరిస్థితి లేదు. బాబు చెప్పినా, మంత్రి లోకేశ్ ప్రకటించినా టీడీపీ నేతలు మాత్రం పిడికెడు ఇసుక కూడా ఉచితంగా వదిలే పరిస్థితి లేదంటున్నారు. అందిన కాడికి అమ్ముకుంటున్నారు. ఇక్కడినుంచి ఇసుక ఇతర జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకూ తరలిపోతోంది. జిల్లాలోని చినగంజాం మండలం కడవకుదురు, వేటపాలెం మండలం పందిళ్లపల్లి ప్రాంతాల నుంచి ప్రకాశం, పల్నాడు జిల్లాలతోపాటు తెలంగాణకి పెద్దఎత్తున ఇసుక తరలిపోతోంది. పర్చూరు, చీరాల నియోజకవర్గాలకు చెందిన టీడీపీ నేతలు ఇసుక అక్రమ రవాణాను నడిపిస్తున్నారు. గతంలో రాత్రిపూట మాత్రమే ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న టీడీపీ నేతలు ఇప్పుడు పగలు కూడా తరలిస్తున్నారు. పందిళ్లపల్లి ప్రాంతం నుంచి బాపట్ల, చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాలకు ఇసుక తరలించి అమ్ముకుంటున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకూ అమ్ముతున్నారు. బాపట్ల నియోజకవర్గం పరిధిలోని వెదుళ్లపల్లి ప్రాంతాల్లోని అసైన్డ్ భూములనుంచి టీడీపీ నేతలు నియోజకవర్గవ్యాప్తంగా ఇసుక తరలించి అమ్ముకుంటున్నారు.



మంత్రుల ఇలాకాల్లోనూ ఇంతే....

- మంత్రి అనగాని సత్యప్రసాద్ సొంత నియోజకవర్గం రేపల్లెలోని పెనుమూడి రేవు నుంచి కొంతకాలంగా ఇసుకను రేపల్లె, చెరుకుపల్లి, గుంటూరు జిల్లా తెనాలి ప్రాంతాలకు తరలించి అమ్ముకుంటున్నారు.
- మాజీ మంత్రి నక్కా ఆనందబాబుకు చెందిన వేమూరు నియోజకవర్గంలో కృష్ణా నది నుంచి ఇసుకను పెద్దఎత్తున తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొల్లూరు మండలం జువ్వలపాలెం, గాజుల్లంక ప్రాంతాల్లోని కృష్ణానది నుంచి ఇసుకను తరలించి వినియోగదారులకు అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇక్కడ జువ్వలపాలెం, గాజుల్లంక రెండు రీచ్‌లను అధికారికంగా గుర్తించారు. కృష్ణా నదిలో నీరు పారుతుండటంతో ఇప్పటికీ రీచ్‌లను ప్రభుత్వం ప్రారంభించలేదు. జనసేన, టీడీపీ నేతలు మాత్రం ఇక్కడి నుంచి వందల ట్రాక్టర్లు పెట్టి అక్రమంగా ఇసుకను తరలించి అమ్ముకుంటున్నారు. గాజుల్లంక ప్రాంతంలో జనసేన నాయకులు ఇసుకను తవ్వితీసి చెరుకుపల్లి, భట్టిప్రోలు, రేపల్లె, తెనాలి ప్రాంతాలకు తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. డిమాండ్‌ను బట్టి ట్రాక్టర్ ఇసుక రూ.3 వేల నుంచి రూ.6 వేల వరకూ అమ్ముతున్నారు.
- మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న అద్దంకి నియోజకవర్గంలోని గుండ్లకమ్మ నది నుంచి టీడీపీ నేతలు ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దాదాపు జిల్లాలోనిఅన్ని నియోజకవర్గాలనుంచి టీడీపీ నేతలు ఇసుకను అక్రమంగా తవ్వి అమ్మకానికి పెట్టారు. చీరాల, పర్చూరు ప్రాంతాల్లో కీలక నేతలే ఇసుక అక్రమ రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

మానవసేవే మాధవసేవ

- శృంగేరీ శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి
- కల్యాణ మండపాన్ని ప్రారంభించిన స్వామిజీ



సంతమాగులూరు (అద్దంకి): మానవసేవే మాధవసేవని శృంగేరీ శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి పేర్కొన్నారు. విజయ యాత్రలో భాగంగా గురువారం బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలంలోని మిన్నెకల్లు గ్రామంలో కల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. అర్చక గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం కల్యాణ మండప ఇన్‌చార్జి, గ్రామస్తుడు బొల్లినేని రామకృష్ణ, గ్రామస్తులు ఆధ్వర్యంలో నిర్వహించారు. తమ గ్రామానికి వచ్చిన స్వామిజీకి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. చిన్నారుల కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కల్యాణ మండప నిర్మాణం కోసం పీఠం నుంచి రూ.కోటి, గ్రామస్తుల తరుపున రూ.15 లక్షలు విరాళంగా ఇవ్వగా మండప ఇన్‌చార్జి బొల్లినేని రామకృష్ణ రూ.25 లక్షలు విరాళంగా ఇచ్చారు. మిన్నెకల్లు పరిసర గ్రామాల్లోని వారికి వివాహాది శుభకార్యాలు జరిపించుకోవడానికి ఒక మంచి కల్యాణ మండపం అందుబాటులోకి వచ్చినట్లైందని రామకృష్ణ తెలిపారు. పీఏ మోహన్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

నగరంపాలెం: జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో వచ్చే నెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు.

మత్స్యకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం
- వాడరేవులో ర్యాలీ

చీరాల టౌన్: గంగమ్మ తల్లిని నమ్ముకుని బతుకు వేట సాగిస్తున్నాం.. వేట తప్ప మరో పని తెలియని మత్స్యకారులం. నిత్యం ప్రాణాలను పణంగా పెట్టి వేట సాగించే మత్స్యకారులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి అండగా నిలవాలని మత్స్యకార పెద్దలు డిమాండ్ చేశారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండలంలోని వాడరేవు గ్రామంలోని మార్కెట్ యార్డు వద్ద నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఫిషర్‌మెన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. గంగమ్మతల్లికి, వేట సామగ్రి, బోట్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో మత్స్యకారులు, మత్స్యకార సొసైటీల నాయకులు, గ్రామస్తులు ర్యాలీ చేశారు.

వేట నిషేధ సాయం అందించాలి..

ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మత్స్యకార పెద్దలు ఎరిపిల్లి రమణ, పిక్కి సంతోష్, రాజారావు, దుర్గారావు, కాశీ తదితరులు మాట్లాడారు. తరతరాలుగా గంగమ్మ తల్లిని నమ్ముకుని సముద్రంలో వేట సాగించే మత్స్యకారుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ఏడాదిలో తుపాన్లు, భారీ వర్షాలు, అల్పపీడనాల వలన వేట సాగక ఇబ్బందులు పడుతున్నామని, అలానే రెండున్నర నెలలపాటు సముద్రంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులు పూటగడవని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. తమ అధికారం కోసం రాజకీయపార్టీలు మత్స్యకారులకు పలు హామీలు ఇచ్చారని తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత తమను పట్టించుకోవడం లేదన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి వేట చేసి కుటుంబాన్ని పోషించుకునే మత్స్యకారులకు వేట నిషేధ సాయం త్వరగా అందిస్తే ఇబ్బందుల నుంచి బయటపడుతామన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి తమకు అండగా నిలవాలని కోరారు. మత్స్యకారులకు అందించే డీజిల్ సబ్సిడీని, రాయితీ డీజిల్ పరిమాణాన్ని కూడా పెంచాలన్నారు. జీపీఎస్ కిట్లు, సోలార్ లైట్లు, లైఫ్ జాకెట్లు, రాయితీపై వలలు, బోట్లు, ఇంజిన్లు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామానికి చెందిన సీనియర్ మత్స్యకారులను సత్కరించారు. కార్యక్రమంలో వాడరేవుకు చెందిన మత్స్యకారులు, సొసైటీ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వాడరేవు ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేస్తున్న మత్స్యకారులు

వలంటీర్ వ్యవస్థ లేదనటం దుర్మార్గం

శాసనసభ మాజీ ఉపసభాపతి కోన రఘుపతి

బాపట్లటౌన్ : అసెంబ్లీ సమావేశాలు, శాసనమండలి సమావేశాల్లో వలంటీర్ల వ్యవస్థ లేదనటం దుర్మార్గమని శాసనసభ మాజీ ఉప సభాపతి కోన రఘుపతి తెలిపారు. బాపట్లలోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు వలంటీర్లకు ఎన్నో ఆశలు పుట్టించి రూ.5 వేలు కాదు..రూ. 10 వేలు ఇస్తామని చెప్పి ప్రస్తుతం వారి గురించి ఇటు అసెంబ్లీ, అటు శాసనమండలిలో ప్రస్తావించకుండా అసలు ఆ వ్యవస్థే లేదని చెప్పడం సమంజసం కాదన్నారు. మేము వలంటీర్ వ్యవస్థను రద్దు చేశామని ధైర్యంగా రాష్ట్ర ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూటమి తరఫున వలంటీర్లను కొనసాగిస్తామని వాగ్దానం చేశారని గుర్తుచేశారు. వలంటీర్లను రద్దుచేయాల్సి వచ్చినప్పుడు కోవిడ్ సమయంలో వారు చేసిన సేవలను గుర్తు చేసుకొని ఉంటే బాగుండేదన్నారు.

రాష్ట్రంలో ఏళ్ల తరబడి సమస్యలతో సతమతమవుతున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను గత ప్రభుత్వం తీసుకువస్తే దాన్ని తృణప్రాయంగా రద్దుచేసిన చరిత్ర కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటిని నేరుగా ముంగిటకే పంపిస్తే అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు వారికున్న మీడియాను ఉపయోగించి ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. వలంటీరు వ్యవస్థను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న శాసనసభ మాజీ ఉపసభాపతి

టూరిజం అభివృద్ధి చెందాలంటే హేచరీలు తొలగించాలి

బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ అసెంబ్లీలో టూరిజం అభివృద్ధి అంశాన్ని ప్రస్తావించడం హర్షనీయం. తీరంలో టూరిజం అభివృద్ధి చెందాలంటే దానికి అడ్డంకిగా ఉన్న హేచరీస్‌ను ఆ ప్రాంతం నుంచి తొలగించాలన్నారు. ఆహ్లాదకరంగా ఉండే 13 కి.మీ తీరం హేచరీల కారణంగా కాలుష్యం కోరల్లో చిక్కుకుంటుందన్నారు. బాపట్లకే తలమానికమైన మెడికల్ కళాశాల ఈ ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి తరలిస్తుంటే దానిపై అసెంబ్లీలో మాట్లాడకపోవడం దురదుష్టకరమన్నారు. ఈ ప్రాంతంలో మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయనే విషయం గుర్తెరిగి వాటిపై అసెంబ్లీలో చర్చిస్తే బాగుంటుందన్నారు. విలేకరుల సమావేశంలో ఎంపీపీ చిన్నపోతల హరిబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జోగి రాజా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పెద్దల కుట్ర మేరకే నాపై కేసు

- ఎటువంటి సాక్ష్యాలు లేకుండా కేసు నమోదు చేయటం దుర్మార్గం
- ఫిర్యాదిదారుడు మతిస్థిమితం లేని ఒక బ్లాక్ మెయిలర్
- బిహార్ నుంచి తుపాకీ తెచ్చి కాల్చేస్తానని ఫిర్యాది అంటున్నాడు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: తెలుగుదేశం పార్టీ పెద్దల కుట్ర, ఆ పార్టీ సెంట్రల్ ఆఫీస్ ఆదేశాల మేరకే తనపై అక్రమ కేసు పెట్టారని, దీనికి భయపడేది లేదని, చట్టపరంగా పోరాడతామని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గురువారం గుంటూరు రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సాక్ష్యాలు లేకుండా అవాస్తవ ఆరోపణలతో ఒక మతి స్థిమితంలేని బ్లాక్‌మెయిలర్ చేస్తున్న ఆరోపణల మేరకు రెండుసార్లు ఎమ్మెల్యేగా వ్యవహరించిన తనపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అక్రమ కేసు బనాయించడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. ఫిర్యాది, పమిడిపాడు గ్రామానికి చెందిన చెందిన కొల్లా సాంబశివరావు ఎవరో తనకు తెలియదని, అతని ముఖం కూడా ఇప్పటివరకు చూడలేదని స్పష్టం చేశారు. అతను ఎవరా అని ఆరా తీస్తే , గుంటూరుకు చెందిన కామరాజు అనిల్‌కుమార్ వద్ద 6.10 ఎకరాల భూమి కొనేందుకు సాంబశివరావు అడ్వాన్స్ చెల్లించి 2021 వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోయాడని, కొందరు రాజకీయనాయకులను పట్టుకొని అప్పుడు ఉన్న డీఎస్పీ వద్ద పంచాయితీ చేసుకున్నాడని తెలిసిందని పేర్కొన్నారు. ఆ భూమి రిజిస్ట్రేషన్ సమయంలో సాంబశివరావు వద్ద డబ్బులు లేకపోతే నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామానికి చెందిన రవికిషోర్‌రెడ్డి ఆ డబ్బు ఇచ్చి తన బంధువైన తాటిపర్తి కోటిరెడ్డి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాడని, అప్పుడే అనిల్‌కుమార్‌కు, తనకు ఎలాంటి వివాదాలూ లేవని సాంబశివరావు ఒప్పందపత్రం రాసిచ్చాడని వివరించారు. ఇప్పుడు ఆ భూమిపై ఎలాంటి హక్కు లేని సాంబశివరావు బ్లాక్‌మెయిల్ చేస్తూ తనపై కేసు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బిహార్ నుంచి తుపాకీ తెప్పించి తమను కాల్చేస్తానని సాంబశివరావు బెదిరిస్తున్నాడని, చూస్తుంటే అతనికి మతిస్థిమితం లేనట్టు ఉందని పేర్కొన్నారు. పోలీసులు ఎలాంటి విచారణ చేయకుండా, ఏం జరిగిందో తెలుసుకోకకుండా కేసు పెట్టడం సరికాదని గోపిరెడ్డి అభిప్రాయపడ్డారు. టీడీపీ పెద్దల ఒత్తిడి మేరకే తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు పలికారన్న సాకుతో పోలీసు ఉన్నతాధికారులపైనా అక్రమ కేసులు పెడుతున్న పరిస్థితి గతంలో ఎన్నడూ చూడలేదని గోపిరెడ్డి విస్మయం వ్యక్తం చేశారు.

డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలంటూ ధర్నా

అవనిగడ్డ: ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో గురువారం కృష్ణా జిల్లా అవనిగడ్డలో ధర్నా చేశారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. నవంబర్ మూడో తేదీన నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్టు చెప్పిన ప్రభుత్వం తరువాత ఆరో తేదీ అని చెప్పి, చివరికి నోటిఫికేషన్‌ను వాయిదా వేసి నిరుద్యోగులను వంచనకు గురి చేసిందన్నారు. అధికారం చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీ ఫైల్‌పై మొదటి సంతకం అంటూ హడావుడి చేసిన చంద్రబాబు ఇంతవరకూ నోటిఫికేషన్ ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. టెట్ తరువాత మూడు నెలల కాల పరిమితి ఉండాలనే సాకుతో కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌కు కాలయాపన చేస్తోందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 6,100 పోస్టులతో డీఎస్సీ ప్రకటించగా, ఆ పోస్టులను కూడా కలుపుకుని 16,347 పోస్టుల్ని ప్రకటించి ఐదు నెలలు అవుతున్నా ఇంతవరకూ తేదీలు ఇవ్వకుండా నిరుద్యోగులనుప్రభుత్వం దగా చేస్తోందన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రస్తావనే లేకపోవడం చూస్తుంటే, డీఎస్సీ అంశంపై కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతుందన్నారు.

పీఎం సూర్యఘర్‌తో తగ్గనున్న విద్యుత్ భారం

జిల్లా నోడల్ ఆఫీసర్ టీవీ తులసీరామ్

మార్టూరు: ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించడమే కాక.. వినియోగదారుడు మిగులు విద్యుత్‌ను విక్రయించడం ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందే అవకాశం ఉంటుందని బాపట్ల జిల్లా ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం నోడల్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టీవీ తులసీరామ్ అన్నారు. మార్టూరు విద్యుత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎం సూర్యఘర్ పథకం ప్రస్తుతం గృహ అవసరాలకు మాత్రమే వర్తిస్తుందని 10 కిలోవాట్ల వరకు కేంద్ర ప్రభుత్వం రాయితీ అందిస్తుందని తెలిపారు. 10 కిలోవాట్ల సోలార్ యూనిట్ ఖర్చు రూ.80వేలు నుంచి రూ.90వేలు వరకు ఉంటుందన్నారు. రాయితీ రూ.30 వేలు వరకు ఉంటుందని, 2 కిలోవాట్ల యూనిట్ ఖర్చు రూ.1.5 లక్షలలోపు ఉండగా రూ.60వేలు సబ్సిడీ వస్తుందన్నారు. మూడు కిలోవాట్ల యూనిట్ ఖర్చు రూ.2.10 లక్షలు ఉండగా రూ.78 వేలు రాయితీ లభిస్తుందని తెలిపారు. 3 నుంచి 10 కిలోవాట్ల యూనిట్ వరకు గరిష్ఠంగా రూ.78వేలు సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు.



మాట్లాడుతున్న నోడల్ అధికారి తులసీరామ్

సోలార్ యూనిట్ వెండర్‌లు వారే 7 శాతం వడ్డీతో బ్యాంకు లోన్‌లు మంజూరు చేయిస్తారని అన్నారు.

వినియోగదారుడికి అదనపు ఆదాయం

వినియోగదారుడు తన అవసరాలు పోను మిగిలిన విద్యుత్‌ను అదే సంస్థ కొనుగోలు చేయనుందని దీనివల్ల వినియోగదారుడికి ఆదాయం చేకూరుతుందన్నారు. వినియోగదారుడు తన ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, కరెంటు బిల్లు వివరాలతో ఆన్‌లైన్‌లో స్వయంగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అద్దంకి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నర్రా మస్తాన్‌రావు, మార్టూరు డీఈ ఎం సురేష్ కుమార్, డివిజనల్ ఏఈలు, జేఈలు, ఇతర సిబ్బంది, సోలార్ యూనిట్ వెండర్‌లు పాల్గొన్నారు.

బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాలకు ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరానికి బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి విద్యార్థులను ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 26వ తేదీన ఈ మేరకు వాక్‌ఇన్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసెట్ 2024లో అర్హత పొందిన అభ్యర్థులు, దరఖాస్తు చేసుకున్న, చేయని వారు కూడా నిర్ణీత రుసుం చెల్లించి హాజరుకావచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వెబ్ సైట్ ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్ లో చూడాలని సూచించారు.

క్లుప్తంగా

చేనేత కార్మికుల ఆత్మహత్యలను నివారించాలి

ఏపీ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి సత్యనారాయణ



భట్టిప్రోలు: చేనేత కార్మికుల ఆత్మహత్యలను వెంటనే నివారించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సత్యసాయి జిల్లా పరిగి మండలం పెద్దరెడ్డిపాలేనికి చెందిన చేనేత కార్మికుడు ఆదినారాయణ అప్పుల బాధలు తాళలేక ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు చేనేత కార్మిక సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. చేనేతపై విధించిన జీఎస్టీని రద్దు చేయాలని, యారన్ సబ్సిడీ, త్రిఫ్ట్ ఫండ్, పావలా వడ్డీ తదితర పథకాలను పునరుద్ధరించాలని పేర్కొన్నారు. నేతన్నలకు ముద్రా రుణాలు 50 శాతం సబ్సిడీతో మంజూరు చేయాలని కోరారు. ఆత్మహత్యకు పాల్పడిన చేనేత కార్మికుడు ఆదినారాయణ కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

339 పరుగులు చేసిన ఉత్తరప్రదేశ్

మంగళగిరి: నగర పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లో కల ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ట్రోఫీలో ఉత్తరప్రదేశ్ జట్టు 339 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర జట్టు బౌలర్లు ఎస్.రాజేష్ 5, బి.యశ్వంత్ 3 వికెట్లు తీసి రాణించారు. 126 ఓవర్లలో 339 పరుగులకు ఉత్తరప్రదేశ్ జట్టు ఆలౌటైంది. అనంతరం గురువారం బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్ర క్రికెట్ జట్టు 42.01 ఓవర్లలో 100 పరుగులకు కుప్పకూలింది. బ్యాటర్ తరుణ్ సాత్విక్ 32 పరుగులు చేశాడు. ఉత్తరప్రదేశ్ బౌలర్ దేవాన్ష్ చతుర్వేది మూడు వికెట్లు తీశాడు. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

24 నుంచి ఫుట్‌బాల్ లీగ్ మ్యాచ్‌లు

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : గుంటూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ నుంచి లీగ్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్స్, కాలేజీలు, యూనివర్సిటీలు, క్లబ్ జట్లు బాలురు, బాలికల విభాగాల్లో నమోదు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను నిర్వహణ కార్యదర్శి బ్రహ్మం ఫోన్ నెంబరు 73375 85790కు పంపాలని సూచించారు.

రైతులు బీమాపై అవగాహన కల్పించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

యద్దనపూడి: రైతులు బీమా పథకాల పట్ల అవగాహన కల్పించుకొని తమ పంటలను బీమా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ అన్నారు. మార్టూరు, పర్చూరు, అద్దంకి సబ్ డివిజన్ పరిధిలోని 10 మండలాలకు సంబంధించి వ్యవసాయ సిబ్బందికి గురువారం మార్టూరు మార్కెట్ యార్డ్ ఆవరణలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పాల్గొని రబీ పంటల బీమా పథకం గురించి వివరించారు. గ్రామాల్లో రైతు సోదరులకు పథకంపై అవగాహన కల్పించి రైతులందరిని ఈ పథకంలో నమోదు చేసుకునేలా చేయాలని రైతు సేవా కేంద్ర సిబ్బందిని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉప్పు నీటి పరిశోధన స్థానం, బాపట్ల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పీ మధువాణి పాల్గొని భూసార పరిరక్షణ, సమస్యాత్మక నేలల యాజమాన్యం గురించి విపులంగా సిబ్బందికి తెలియజేశారు. జిల్లా వనరుల కేంద్రం బాపట్ల డిప్యూటీ డైరక్టర్ ఎం విజయనిర్మల రబీ పంటపై వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం బాపట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు టీ రత్నకుమారి, మార్టూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు కే ధనరాజ్, మండలాల వ్యవసాయ అధికారులు, వీఏఏ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రికి అవోపా సన్మానం



టీజీ భరత్‌ను సత్కరిస్తున్న అవోపా ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో గురువారం రాత్రి అమరావతి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, క్రేన్ గ్రూప్ అధినేత జీవీఎస్ కాంతారావు, అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, ప్రతినిధులు కేవీ బ్రహ్మం, రాచపూడి సుబ్బారావు, మద్దు రామకృష్ణయ్య, కొత్తమాసు ఏకానంద్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి షాపుల్లో దొంగతనాలు

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన షాపు యజమానులు
- ఆధారాలు సేకరించేందుకు రంగంలోకి దిగిన క్లూస్ టీం



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

పర్చూరు (చినగంజాం): పర్చూరులోని ప్రధాన కూడలి బొమ్మల సెంటర్‌లో బుధవారం అర్ధరాత్రి దొంగలు పలు షాపుల్లో వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. స్థానిక చీరాల రోడ్డు, ఇంకొల్లు రోడ్డులోని షాపులలో బుధవారం రాత్రి సుమారు 12 గంటల సమయంలో ఈ వరుస దొంగతనాలు చోటుచేసుకున్నాయి. చీరాల రోడ్డులోని ఆటోమొబైల్ షాపు, చిల్లరకొట్టులో దొంగతనం జరగగా, ఇంకొల్లు రోడ్డులోని సెల్‌ఫోన్ షాపు, డ్రైఫ్రూట్స్, మిల్క్ సెంటర్ షాపుల్లో దొంగతనాలు జరిగినట్లు షాపు యజమానులు గుర్తించారు. గురువారం ఉదయం షాపులు తెరచిన అనంతరం తమ షాపులలో దొంగతనాలు జరిగినట్లు గుర్తించిన యజమానులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుకు వెంటనే స్పందించిన ఎస్ఐ మాల్యాద్రి ఉన్నతాధికారులకు సమాచారమందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్లూస్ టీం వెంటనే రంగంలోకి దిగి దొంగతనాలు జరిగిన ప్రాంతంలో ఆధారాలను సేకరించారు. ఈ విషయమై ఎస్ఐను వివరణ కోరగా వరుస దొంగతనాలపై షాపు యజమానులను విచారిస్తున్నట్లు, దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను పట్టుకునేందుకు సత్వరం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

సురక్ష బీమా.. కుటుంబానికి ధీమా

- పాలసీని ప్రతిష్ఠాత్మకంగా తెచ్చిన కేంద్రం
- బ్యాంక్ ఖాతా ఉంటే చాలు తీసుకోవడం తేలిక
- ప్రీమియం ఏడాదికి రూ.20 మాత్రమే

కొరిటెపాడు (గుంటూరు): కేంద్ర ప్రభుత్వం పలు బీమా పథకాలను అమలు చేస్తోంది. వాటిలో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) ఒకటి. ఇది యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పాలసీ. దురదృష్టవశాత్తు పాలసీదారు మరణిస్తే వారి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పిస్తుంది. 18 – 70 సంవత్సరాల మధ్య వయస్సు వారు బీమాకు అర్హులు. బ్యాంకు ఖాతా ఉంటే అధికారులను కలిసి వివరాలు తెలుసుకోవచ్చు. ఆటో డెబిట్ ఫెసిలిటీ యాక్టివేట్ చేసుకోవాలి. అకౌంట్ నుంచి ప్రతి సంవత్సరం మే నెల చివరిలో రూ.20 నేరుగా కట్ అవుతాయి. అందువల్ల ఖాతాదారుడు ఆ నెలలో అకౌంట్‌లో మినిమం బ్యాలెన్స్‌తోపాటు అదనంగా రూ.20 కచ్చితంగా ఉంచాలి. ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి అంగవైకల్యం పొందినా రూ.2 లక్షలు, పాక్షిక అంగవైకల్యానికి రూ.లక్ష వరకు నామినీకి అందిస్తారు. గుర్తింపు కోసం ఆధార్ కార్డు, ఫోను నంబరు, నామినీ వివరాలు, బ్యాంక్ ఖాతా వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన(పీఎంజీజీవై) పథకాన్ని కూడా కేంద్రం ప్రవేశపెట్టింది. ఇందులో రూ.436 వార్షిక ప్రీమియంతో అన్ని రకాల మరణాలకు రూ.2 లక్షల కవరేజీ ఇస్తారు. 18 – 50 ఏళ్ల వయస్సు మధ్య వారు ఈ బీమా పొందవచ్చు. ఈ బీమా అన్ని బ్యాంకులు, తపాలా కార్యాలయాల నుంచి తీసుకోవచ్చు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బీమా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. పీఎంఎస్‌బీవై, పీఎంజీజీవైలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నాం. నిరుపేదలకు ఇవి చాలా ఉపయోగకరం. ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే కుటుంబానికి ఆర్థిక భరోసా కలుగుతుంది. పూర్తి అంగవైకల్యం కలిగినా ఒప్పందం ప్రకారం బీమా మొత్తం చెల్లిస్తారు.

– మహిపాల్‌రెడ్డి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్

రైల్వేగేటును ఢీకొట్టిన కారు



రైల్వేగేటు కిందకు దూసుకుపోయి నిలిచిన కారు

చీరాల రూరల్: రైల్వేగేటు మూసి ఉండగా ఓ కారు వేగంగా గేటులో నుంచి దూసుకుపోయి నిలిచిపోయింది. ఈ ఘటన గురువారం రాత్రి చీరాలలోని కారంచేడు రైల్వేగేటు సెంటర్లో చోటుచేసుకుంది. ఆర్పీఎఫ్ సీఐ చంద్రశేఖర్ వివరాల మేరకు.. దేవరంపాడుకు చెందిన రామకృష్ణ అనే వ్యక్తి తన కారును వేగంగా నడిపి మూసి ఉన్న గేటును ఢీకొట్టినట్లు చెప్పారు. ఆ సమయంలో పట్టాలపై ఓ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణించిందని, కారు పట్టాలపైకి చేరినట్లయితే పెనుప్రమాదం జరిగేదని సీఐ తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకుని కారు నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆడిట్ కమిషనరేట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు

లక్ష్మీపురం: దేశంలోని 48 సి.జి.ఎస్.టి. ఆడిట్ కమిషనరేట్‌లలో గుంటూరు కమిషనరేట్‌కు యాన్యువల్ కంపోజిట్ గ్రేడింగ్‌లో 2023–24 ఆర్థిక ఏడాదికి ప్రథమ స్థానం దక్కింది. ఈ మేరకు ఢిల్లీలోని సి.జి.ఎస్.టి ఆడిట్ డైరెక్టరేట్ జనరల్ కార్యాలయం గురువారం వివరాలు వెల్లడించింది. వంద మార్కులకు గుంటూరు కార్యాలయం అత్యధికంగా 73.22 సాధించింది. ఇందుకు కారణమైన అధికారులకు ఆ శాఖ చీఫ్ కమిషనర్ సంజయ్ రాఠీ, కమిషనర్ పి.ఆనంద్ కుమార్‌లు అభినందించారు.

ముగ్గురు చిన్నారులను రక్షించిన ఆర్పీఎఫ్ పోలీసులు

పిడుగురాళ్ల: రైలులో ఒంటరిగా ప్రయాణిస్తున్న ముగ్గురు చిన్నారులను గుర్తించి గుంటూరు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించినట్లు పిడుగురాళ్ల ఆర్‌పీఎఫ్ సీఐ కె.ఏడుకొండలు తెలిపారు. పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో హౌరా నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్‌లో గురువారం మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. దీనిలోభాగంగా జనరల్, స్లీపర్ బోగీలను తనిఖీ చేయటంతో అందులో ముగ్గురు బాలురు హౌరా నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్నట్లు గుర్తించారు. వారు కూలి పనులకు వెళ్తున్నారని తెలపటంతో అనుమానంతో ఆర్పీఎఫ్ పిడుగురాళ్ల స్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలురు ఓ అనుమానిత వ్యక్తితో కలిసి కూలిపనులకు వెళ్తున్నట్టు తెలిసిందని, వారిని రక్షించి గుంటూరు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించామని పేర్కొన్నారు. దర్యాప్తు కొనసాగుతోందని వివరించారు.

ముత్తూట్ ఫైనాన్స్ రెడ్‌పై ఫిర్యాదులు

సత్తెనపల్లి:స్థానిక ముత్తూట్ ఫైనాన్స్ రెడ్ బ్రాంచ్‌లో అవకతవకలు జరిగినట్లు ఆరోపిస్తూ ఖాతాదారులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదులు చేస్తున్నారు. ముప్పాళ్ళ మండలం నార్నెపాడుకి చెందిన వెల్లంపల్లి విజయ్‌కుమార్ 20 గ్రాముల బంగారు ఆభరణాలను కుదవపెట్టి గత ఏప్రిల్ 19న రూ.60 వేలు, ఆయన భార్య 33.5 గ్రాములు బంగారు నగలు కుదవ పెట్టి రూ.1.20 లక్షలు అప్పుగా తీసుకున్నారు. 20 గ్రాములకు రూ.98 వేలు, 33.5 గ్రాములకు రూ.1,60,050 చెల్లించాలని చెప్పడంతో విజయ్‌కుమార్ అవాక్కయ్యాడు. ఎందుకు చెల్లించాలని ప్రశ్నించటంతో వాదోపవాదాలు జరిగాయి. ప్రతి నెలా వడ్డీ చెల్లిస్తున్నా ఎక్కువ మొత్తంలో చూపుతూ అవకతవకలకు సిబ్బంది పాల్పడినట్లు ఆరోపించాడు. విచారించి న్యాయం చేయాలంటూ విజయ్‌కుమార్ పట్టణ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పత్తికి మద్దతు ధర చెల్లించాలి

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు డిమాండ్



మాట్లాడుతున్న హరిబాబు

సత్తెనపల్లి: పత్తి క్వింటాకు రూ.7,521 మద్దతు ధర చెల్లించాలని, పత్తి కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల్లోనే ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు.సత్తెనపల్లిలోని పుతుంబాక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. నిబంధనల పేరుతో పత్తి కొనుగోలుకు సీసీఐ కేంద్రాలు నిరాకరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిబంధనలను సడలించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర చెల్లించడం లేదని వివరించారు. కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి వై రాధాకృష్ణ మాట్లాడుతూ ఈనెల 26న పత్తి రైతులతో కలిసి నరసరావుపేట కలెక్టరేట్ వద్ద భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు కామినేని.రామారావు, సత్తెనపల్లి మండల కార్య దర్శి పెండ్యాల మహేష్‌లు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

స్వగ్రామం నెమలికల్లులో విషాదం



వంగానవీన్‌రెడ్డి (ఫైల్)

అమరావతి: నెమలికల్లు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వంగా నవీన్‌రెడ్డి(24) గురువారం హైదరాబాద్‌లో తాను పనిచేస్తున్న కార్యాలయ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. నెమలికల్లు గ్రామానికి చెందిన వంగా శ్రీనివాసరెడ్డి, ప్రమీల దంపతులు తమకున్న రెండు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ తమ ఇద్దరి కుమారులను చదివించారు. పెదవాడైన నవీన్‌రెడ్డికి ఇటీవల ఇంజనీరింగ్ పూర్తిచేసుకుని హైదరాబాద్‌లోని సాఫ్టవేర్ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. గురువారం తాను పనిచేస్తున్న ఆఫీసు భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. చేతికందివచ్చిన కొడుకు ఇలా బలవన్మరణానికి పాల్పడడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. శ్రీనివాసరెడ్డి రెండో కుమారుడు ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. గురువారం రాత్రికి నవీన్‌రెడ్డి మృతదేహం స్వగ్రామమైన నెమలికల్లు చేరుకుంది.

రేపు స్విమ్మింగ్ జిల్లా జట్ల ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి గురువారం తెలిపారు. డిసెంబర్ 7, 8 తేదీలలో విశాఖలో జరగనున్న 9వ వింటర్ సబ్ జూనియర్, జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఈ జట్లను ఎంపిక చేస్తున్నట్టు వివరించారు. అండర్-11, అండర్-14, అండర్-17 విభాగాలలో జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 23న ఉదయం 8 గంటలకు స్విమ్మింగ్‌పూల్ వద్దకు రావాలని సూచించారు. ఇతర వివరాలకు 8296374963 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వలంటీరు వ్యవస్థపై టీడీపీ ప్రకటన సిగ్గుచేటు

వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



రేపల్లె రూరల్: వలంటీరు వ్యవస్థ లేదని, కొనసాగించబోమని శాసనమండలి సమావేశాల్లో రాష్ట్ర మంత్రి డోలా బాలవీరాంజనేయులు ప్రకటించడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ పేర్కొన్నారు. గుళ్లపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏరుదాటిన తర్వాత తెప్ప తగలబెట్టిన చందాన కూటమి నేతలు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందు వలంటీరు వ్యవస్థను కొనసాగించడంతోపాటు నెలకు రూ.10,000 వేతనం అందిస్తామని చంద్రబాబు నాయుడుతోపాటు ఇతర కూటమి నేతలు ప్రచారం చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. తీరా గెలిచాక వలంటీర్లను మోసం చేశారన్నారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు ప్రాణాలకు తెగించి చేసిన సేవలు మరువరదన్నారు. అవినీతికి తావు లేకుండా ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో వలటీర్ల పాత్ర కీలకం అన్నారు. వలంటీర్ల సేవలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే అనేక సందర్భాలలో అభినందించారని గుర్తుచేశారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన వలంటరీ వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

క్రీడాపోటీలతో ఉద్యోగుల్లో నూతనోత్సాహం



మాట్లాడుతున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

లక్ష్మీపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలతో వారిలో నూతనోత్సాహం కలుగుతుందని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయ ప్రాంగణంలో గురువారం రెండో విడత డీఆర్ఎం కప్ క్రీడా పోటీలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. క్రీడాస్ఫూర్తిని పెంచేందుకు, నైపుణ్యం వెలికి తీసేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయని తెలిపారు. కప్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. మహిళా ఉద్యోగులను భాగస్వాముల్ని చేయాలని సూచించారు. దీనికి డీఆర్ఎం స్పందించి మరుక్షణమే ఆ సూచన అమలుకు చర్యలు చేపట్టారు. తర్వాత డీఆర్ఎం మాట్లాడుతూ... శనివారం నుంచి పోటీలు ఉంటాయని తెలిపారు. గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, నంద్యాల, యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొంటారని వివరించారు. ప్రైవేట్ రిజిస్టర్డ్ సంస్థల వారికీ అవకాశం కల్పించామన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి , జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ, రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి శివహర్ష, డీఆర్ఎం రామకృష్ణలు ఈ సందర్భంగా కాసేపు బాస్కెట్ బాల్ ఆడారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కె.సైమన్, సీపీఎం గుంటూరు మనోహర్‌రెడ్డి, డివిజన్ క్రీడాధికారి ఎం.దినేష్‌కుమార్, సీనియర్ డీపీఓ షహబాజ్ హనూర్, డీసీఎం కమలాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

యార్డుకు 46,017 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 46,017 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 44,282 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 37,373 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.